తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక

# జనంసాక్షి

www.janamsakshi.org

మెదక్ - మహబూబ్‌నగర్

సంగారెడ్డి | సిద్దిపేట
జోగులాంబ గద్వాల
వనపర్తి | నారాయణపేట
నాగర్ కర్నూల్

బుధవారం
07 మే 2025



Follow :

## అంగన్వాడీ కేంద్రాల అభివృద్ధికి ప్రభుత్వం కృషి

### రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క

**తూప్రాన్ మే 6 (జనంసాక్షి) :** అంగన్వాడి కేంద్రాల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందని రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క తెలిపారు మనోహరాబాద్ మండలం పరిధిలోని శుభం గార్డెన్స్ లో మంగళవారం రోజు అంగన్వాడీ కేంద్రాల గ్రాడ్యుయేషన్ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు . ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు పనిచేస్తున్నాయని ఇటీవల పదవ తరగతి పరీక్ష ఫలితాలలో ప్రభుత్వ పాఠశాలలో చదివిన విద్యార్థులు ర్యాంకులు సాధించాలని అన్నారు. చిన్నారుల వేష ధారణ నృత్య ప్రదర్శన ఫుడ్ సెలబ్రేషన్స్ చూస్తే మనసుకు చాలా సంతోషంగా ఉందని సంతోషాన్ని



వ్యక్తం చేశారు. సీతక్క వేష ధారణలో చిన్నారి మంత్రికి స్వాగతం పలికారు. అనంతరం నృత్యాలు,పోషక ఆహారాలు,వాటర్ బాటిల్స్ పంపిణీ, చేసి చిన్నారులకు గ్రాడ్యుయేషన్ పట్టాలను మంత్రి అందజేశారు. అమ్మ ఒడి అంగన్వాడీ బడి రెండు ఒకటేనని చిన్నారులను ఇంత ల తల్లి ప్రేమ ల ఆదరిస్తున్న టీచర్ లను అభినందించారు. ఈ కార్యక్రమంలో గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డి,ఎలక్షన్,పాక్స్ చైర్మన్ బాలకృష్ణ రెడ్డి మాజీ ఎంపీటీసీ రేఖల కృష్ణ గౌడ్ ,హైమవతి, హేమ భార్గవి మెహతా బేగం అంగన్వాడీ కేంద్రాల టీచర్లు ఆయాలు తదితరులు పాల్గొన్నారు.



## ముగ్గురిని ఢీకొట్టిన కారు

### మహిళ అక్కడికక్కడే మృతి.. ఇద్దరు పరిస్థితి విషమం

**నార్సింగి మే 06 (జనంసాక్షి) :** రోడ్డు దాటుతుండగా గుర్తు తెలియని వాహనం (కారు) ఢీ కొట్టగా ఒకరు మృతి చెంది, ఇద్దరికీ తీవ్ర గాయాలైన సంఘటన మండల పరిధిలోని జాతీయ రహదారి 44 వల్లూరు వద్ద చోటు చేసుకుంది. స్థానిక ఎస్ఐ అహ్మద్ మోహిఉద్దీన్ తెలిపిన వివరాల ప్రకారం చెగుంట మండలం వల్లభాపూర్ కు చెందిన పోచమ్మల మారవ్వ (60), పోచమ్మల రామయ్య (64), రుక్మాపూర్ గ్రామానికి చెందిన మైలారం దశరథ్ (45) ముగ్గురు చెగుంట వైపు నుంచి వస్తూ వల్లభాపూర్ వద్ద బస్సు దిగి రోడ్డు దాటు తున్నారు. ఈ క్రమంలో నిజామాబాద్ నుంచి హైదరాబాద్ వైపు వెళుతున్న గుర్తు తెలియని కారు డ్రైవర్ అతివేగంగా, అజాగ్రత్తగా కారును నడుపుతూ ముగ్గురిని ఢీ కొట్టి పారిపోయాడు. ఈ ఘటనలో పోచమ్మల మారవ్వ అక్కడిక్కడే మరణించగా, రామయ్య, దశరథ్ లకు తీవ్ర గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న స్థానిక ఎస్ఐ సిబ్బందితో పాటు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. ప్రమాదంలో



గాయపడిన రామయ్య ను చికిత్స నిమిత్తం రామాయంపేట కమ్యూనిటీ ఆసుపత్రి కి తరలించగా, దశరథ్ కు నార్సింగి లోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. ఘటనలో మరణించిన మారవ్వ మృత దేహానికి పోస్ట్ మార్టం నిమిత్తం రామాయంపేట కమ్యూనిటీ ఆసుపత్రి కి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించినట్లు ఎస్ఐ అహ్మద్ మోహిఉద్దీన్ వివరించారు.

## ఈడిసి పోస్టులకు దరఖాస్తు చేసుకోండి



**నారాయణపేట జిల్లా బ్యూరో (జనం సాక్షి):** కేంద్ర ప్రభుత్వ పథకం కింద జిల్లాలో సూక్ష్మ, చిన్న మరియు మధ్యతరహ పారిశ్రామిక రంగాల పనితీరును మెరుగుపరిచేందుకు జిల్లా పరిశ్రమల కేంద్రంలో మేనేజర్,అసిస్టెంట్ మేనేజర్ పోస్టులను సృష్టించడం జరిగిందని జిల్లా కలెక్టర్ సిక్త పట్నాయక్ ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో భాగంగా జాతీయ సూక్ష్మ ,చిన్న మరియు మధ్యతరహా పరిశ్రమల సంస్థ జిల్లాకు మేనేజర్ ఈడిసి అసిస్టెంట్ మేనేజర్ ఈడిసి పోస్టులను కేటాయించడం జరిగిందని తెలిపారు. ఇట్టి పోస్టులను కాంట్రాక్టు పద్ధతిన భర్తీ చేయడానికి అర్హులైన అభ్యర్థుల నుండి దరఖాస్తులను స్వీకరించడం జరుగుతుందన్నారు. దరఖాస్తు చేసుకునేందుకు మే,10వ తేదీని చివరి తేదీగా నిర్ణయించినట్లు తెలిపారు.అభ్యర్థులు ఇతర వివరాలకు www.nimsme.gov.in వెబ్‌సైట్‌ను సంప్రదించాలని, ఇతర వివరాలకు సెల్ నెంబర్ ను 9966171253 సంప్రదించాలని సూచించారు.

## రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు

### రైతులు సద్వినియోగం చేసుకోవాలి : సిడిసి చైర్మన్ గడీల రామ్ రెడ్డి



**సదాశివపేట మే 6(జనం సాక్షి) :** రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు అనే కార్యక్రమాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని సీడీసీ చైర్మన్ గడిల రామ్ రెడ్డి సూచించారు. మంగళవారం సదాశివ పేట మండలం ఆత్మకూరు గ్రామంలో ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ విశ్వ విద్యాలయం, వ్యవసాయ శాఖ సంయు క్తంగా నిర్వహించిన రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు, రైతు అవగాహన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో రైతులకు అవగాహన కల్పించడం ఒక మంచి కార్యక్రమం అన్నారు. ఆధునాతన వ్యవసాయంపై అవగాహన కల్పించి చైతన్యవంతులు చేయడం ద్వారా రైతులు పంటల్లో మంచి దిగుబడి సాధిస్తారన్నారు. శాస్త్రవేత్తల సలహాలు సూచనల మేరకు రసాయానిక ఎరువులను, పురుగుల మందులను తగ్గించి పంట పండించడం రైతులకు ఎంతో లాభదాయకమని చెప్పారు. తక్కువ యూరియా వాడడంతో సాగు ఖర్చు తగ్గించుకోవాలని పరిశోధన కేంద్రం ప్రిన్సిపల్ శాస్త్రవేత్త విజయకుమార్ సూచించారు. అవసరం మేరకు మాత్రమే రసాయనాలను వినియోగించడం వల్ల నేల తల్లి సారాన్ని కాపాడిన వాళ్ళమవుతామని చెప్పారు. రైతులు ఎరువుల దుకాణాల్లో కొనుగోలు చేసిన విత్తనాలకు కచ్చితంగా రసీదు తీసుకోవాలని తెలిపారు. సాగునీటిని ఆదా చేసి భవిష్యత్తు తరాలకు అందించడం మన బాధ్యత అని అన్నారు. పంట మార్పిడిని పాటించి సుస్థిర ఆదాయాన్ని పొందాలని సూచించారు. చెట్లను పెంచి పర్యావరణాన్ని కాపాడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పరిశోధన కేంద్రం శాస్త్రవేత్తలు విజయలక్ష్మి, ఏడిఏ వెంకటలక్ష్మి, గణపతి షుగర్ ఫ్యాక్టరీ కెన్ జనరల్ మేనేజర్ కృష్ణమోహన్, మండల వ్యవసాయ అధికారి రమేష్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు చాట్ల సిద్ధన్న, ఆత్మకూర్ క్లస్టర్ ఏఈఓ శ్రీదేవి, ఆత్మకూరు తాజా మాజీ సర్పంచ్ గంగన్న, వెంకటాపురం మాజీ ఎంపీటీసీ శ్రీనివాస్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ యూసుఫ్, నాయకులు,రైతులు పాల్గొన్నారు.



## చేతకాక పోతే తప్పుకో..

### రేవంత్ రెడ్డికి నామాజీ డిమాండ్



**నారాయణపేట జిల్లా బ్యూరో(జనం సాక్షి):** అధికారంలోకి వచ్చేందుకు అడ్డదిడ్డంగా హామీలు ఇచ్చి కుర్చీపై కూర్చుని చేతులు ఎత్తెస్తామంటే కుదరదని చేతకాకపోతే ప్రజలకు భేషరతుగా క్షమాపణలు చెప్పి సి ఎం పదవికి రాజీనామా చేయాలని సి ఎం రేవంత్ రెడ్డికి బిజెపి రాష్ట్ర సీనియర్ నేత, రాష్ట్ర క్రమశిక్షణ సంఘం సభ్యుడు నాగురావు నామాజీ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. అప్పు అడగడానికి వెళితే బిక్షగాళ్ళల చూస్తున్నారని అనడం సి ఎం పదవికే సిగ్గు చేటని అన్నారు.ఎన్నికల ముందు రాష్ట్రం దివాలా తీసిన విషయం తెలియదా అని ప్రశ్నించారు.అధికారం కోసం ప్రజలనువభ్యపెట్టి అధికారంలోకి వచ్చాక సిగ్గుమాలిన మాటలు మాట్లాడడం విడ్డూరంగా ఉందని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం గ్యారెంటీ ల గారదితో 6 అబద్ధాలు 66 మోసాలతో అధికారంలోకి వచ్చిందన్నారు.రైతు రుణమాఫి లేదు,ఏడాది అయినా రైతు బరోసా లేదని,మహాలక్ష్మి పేరుతో మహిళలను మోసం చేశారని అన్నారు.అలాగే గృహజ్యోతి తో మహిళలను మోసం చేశారని,వృద్దులకు చేయూత అందించలేదని,యువత వికాసం మరిచారని సొంతిల్లు కలగానే మిగిలి పోయిందని విమర్శించారు.అన్ని వర్గాల ప్రజలు రోడ్డున పద్దారని అన్నారు.చేతులు ఎత్తేసేటో డివి ఏడాది సంబరాలు ఎలా జరుపుకున్నారని ప్రశ్నించారు.చేతకాకపోతే ప్రజలకు క్షమాపణలు చెప్పి పదవికి రాజీనామా చేయాలని డిమాండ్.వచ్చే వాళ్ళు ఎలాగైనా అభివృద్ధి చేస్తారని అన్నారు.ఏడాదిన్నర కాలానికే చేతులు ఎత్తేసిన ఏకైక ముఖ్యమంత్రిగా రేవంత్ రెడ్డి చరిత్రకు ఎక్కుతారని అన్నారు.

# అంపశయ్యపై రాష్ట్ర రాష్ట్ర ప్రభుత్వం

## దిక్కులేక ప్రభుత్వ ఉద్యోగులపై సీఎం ఫైర్



**మెదక్ జిల్లా బ్యూరో, మే 6 (జనంసాక్షి):** అంపశయ్య పై రాష్ట్ర ప్రభుత్వం వుందని మెదక్ పట్టణ బీఆర్ ఎస్ పార్టీ అధ్యక్షుడు మాజీ కౌన్సిలర్ మామిడ్ల అంజనేయులు ఒక్క ప్రకటన లో అన్నారు. అధికారంలో వున్న సీఎం రేవంత్ రెడ్డి ఖజానా ఖాళీ అయ్యిందని చెప్పడం శోచనీయం అన్నారు. ఆర్థిక సంక్షోభంలో కొట్టుమిట్టాడుతుందని చేతులెత్తేసిన సిపాయిలా వుందని ఎద్దేవా చేశారు. దేశంలో అనేక రాష్ట్రాలు అప్పుల్లో ఉన్నప్పటికీ ఏ ముఖ్యమంత్రి కూడా మా రాష్ట్రం అప్పుల్లో ఉందని చెప్పడం లేదని తెలంగాణ ముఖ్యమంత్రి కి పాలన చేతకాక సంపద సృష్టించలేక ఆయన మాట్లాడిన మాటలు ఉద్యోగస్తులకు, ప్రజలకు మధ్య విభేదాలు తెచ్చే విధంగా వున్నాయని చెప్పారు. కెసిఆర్ పాలనలో నోట్ల రద్దు, రెండు సంవత్సరాలు కరోనాతో ప్రపంచమే కొట్టుమిట్టాడుతూ నయా పైసా పుట్టని అత్యంత ప్రమాదకరమైన పరిస్థితుల్లో రాష్ట్రం ఉన్నప్పటికీ ఆయన తెలివితేటలతో సంపదను సృష్టించి ఏ ఒక్క స్కీం కూడా ఆపకుండా రాష్ట్రాన్ని దేశంలోనే ఉన్నత స్థాయిలో నడిపించిన ఘనత కేసిఆర్ దని తెలియజేశారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రగల్బాలతో కాలం వెళ్లదీస్తుందని, ప్రభుత్వం విఫలమైందని రాష్ట్ర ముఖ్యమంత్రి ఒప్పుకున్నాడని పేర్కొన్నారు. 16 నెల నుండి స్థానిక సంస్థల మున్సిపల్ ఎన్నికలు నోటిఫికేషన్ వెయ్యకపోవడం సిగ్గుచేటని విమర్శించారు.

## ఆయుష్మాన్ భారత్ డిజిటల్ మిషన్‌ను వినియోగించాలి



**నారాయణపేట జిల్లా బ్యూరో (జనంసాక్షి) :** జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖధికారి కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన సమావేశంలో జిల్లా వైద్య మరియు ఆరోగ్యశాఖ అధికారి ఆదేశాలతో జిల్లాలోని అన్ని ప్రైవేటు ఆసుపత్రులలో మరియు ల్యాబ్ లలో ఆయుష్మాన్ భారత్ డిజిటల్ మిషన్ ను వినియోగించాలని, ఏ బిడియం మేనేజర్ ప్రకాష్ అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖధికారి డా. కె జయచంద్ర మోహన్ మాట్లాడుతూ ప్రతీ ఆసుపత్రికి వచ్చే రోగుల వివరాలను ఆయుష్మాన్ భారత్ యాప్లో నమోదు చేయాలన్నారు. దీనివల్ల ఆసుపత్రులకు, ఫార్మసీకి వచ్చే రోగుల హెల్త్ కార్డును లింక్ చేస్తే జాతీయ ఆరోగ్య మిషన్ ద్వారా ప్రతీ కార్డుకు రూ. 20 చొప్పున ఇన్సెంటివ్ పొందవచ్చని తెలిపారు. రోగుల సంరక్షణకు, డిజిటల్ ఆరోగ్య సేవలను ప్రజలు పొందేందుకు, వారి ఆరోగ్య డేటా సంరక్షించుకునేందుకు ఆయుష్మాన్ భారత్ హెల్త్ అకౌంట్ ఉపయోగపడుతుందని వివరించారు. ఈకార్యక్రమంలో డా. శైలజ నోడల్ ఆఫీసర్ సిఈ ఏ, శ్రీనివాసులు ఇంచార్జి మాస్ మీడియా ఆఫీసర్, బిక్షపతి డిపిఓ గోవిందా రాజు ఎంపిహెఈ ఒ మరియు ప్రైవేట్ హాస్పిటల్ ల్యాబ్ టెక్నీషియన్స్ తదితరులు పాల్గొన్నారు

## బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడికి శుభాకాంక్షలు తెలిపిన మాజీ ఎంపీపీ



**నారాయణపేట, మే6 (జనం సాక్షి):** బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే సుంకిరెడ్డి రాజేందర్రెడ్డి జన్మదినాన్ని మాజీ ఎం పీపీ అమ్మకోళ్ళ శ్రీనివాస్ రెడ్డి మంగళవారం ఆయన స్వగృహంలో కలిసి శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈసందర్భంగా బీఆర్ఎస్ జిల్లా అధ్యక్ష పదవితో పాటు ఇంకా మునుముందు ఉన్నత పదవులను పొందాలని ఆకాంక్షించారు. అనంతరం మాజీ ఎమ్మెల్యే పేట మండలంలో బీఆర్ఎస్ పార్టీ స్థితిగతుల గురించి ప్రజలకు అవసరమయ్యే మౌళిక సదుపాయాల గురించి ఆరా తీశారు. పార్టీపరంగా ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వారధిగా ఉండి ప్రజల సమస్యలను తీర్చేలా కృషి చేయాలని మాజీ ఎంపీపీని ఆదేశించారు.

# ఫోటో వీడియో గ్రాఫర్లపై దాడిని తీవ్రంగా ఖండిస్తున్నాం

## ఫోటో వీడియో గ్రాఫర్ల వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు మిత్రా రాజు



**నాగర్ కర్నూల్ జిల్లా బ్యూరో,మే6(జనంసాక్షి):** రంగారెడ్డి జిల్లా చేవెళ్ల మున్సిపల్ పరిధిలో ఒక ఫంక్షన్ హాల్ లో జరిగిన కార్యక్రమంలో ఫోటో గ్రాఫర్స్ రాజు, మధు,శ్రీకాంత్ పై జరిగిన దాడిని నాగర్ కర్నూల్ జిల్లా ఫోటో వీడియో గ్రాఫర్ల వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు మిత్ర రాజు తీవ్రంగా ఖండించారు. ఫంక్షన్ ఫోటోలు తీస్తున్న సమయంలో ఫంక్షన్ కు వచ్చిన ఒక బంధువు తన ఫోటో ఫోన్లో తీయాలని చెప్పి చెప్పగా దానికి నిరాకరించి,ఫోటో వీడియో గ్రాఫర్లు మేము ఫోటోలు ఫోన్లో తీయమని చెప్పడంతో దానికి ఆ ఫంక్షన్ కి వచ్చిన బంధువు అసహనానికి గురైన తనతోపాటు వచ్చిన బంధువులను పిలుచుకొని ఫోటో వీడియో గ్రాఫర్లపై దుర్భాషలాడుతూ వారి పైన దాడి చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని సమాజంలో ఇలాంటి దాడులను ఎవరు కూడా సమర్థించరని,ఫంక్షన్ లలో ఫోటో వీడియో గ్రాఫర్లు తీవ్రంగా కష్టపడుతూ వారి సమస్యలను అధిగమించి కష్టమర్లకు సంతృప్తి పరచాలన్న ఉద్దేశంతో ఫోటోగ్రాఫర్ లు లక్షలలో డబ్బులు పెట్టుబడి పెట్టి నిరంతరము కష్టపడే వ్యక్తులు అని, ఫోన్లో ఫోటోలు తీయండి వీడియోలు తీయండి అని మీకు ఇష్టం వచ్చినట్లు ప్రవర్తించడం మంచి పద్ధతి కాదని హెచ్చరించారు. ఇలాంటి దాడులను మరోసారి ఎక్కడ జరిగినా తక్షణమే వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రతిస్పందన ఉంటున్నదని నాగర్ కర్నూల్ జిల్లా వెల్ఫేర్ అసోసియేషన్ తరపున తీవ్రంగా ఖండిస్తున్నామని అన్నారు.

# పార్టీలకతీతంగా ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేయాలి

## మాజీ ఉపసర్పంచి బి.రామకృష్ణ



**మహమ్మదాబాద్ మే 6(జనంసాక్షి) :** కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఇందిరమ్మ ఇండ్లను పార్టీలకు అతీతంగా పేద ప్రజలను గుర్తించి ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేయాలిఅని మంగళవారం మీడియా మిత్రులతో మాట్లాడుతూ గాదిర్యాల్ గ్రామం మాజీ ఉపసర్పంచి బి,రామకృష్ణ అన్నారు. కొన్ని గ్రామాలలో కేవలం కాంగ్రెస్ పార్టీకి అంకితమై ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేయడం సరికాదు అన్నారు. గ్రామాలలో చాలా కుటుంబాలలో ముగ్గురు నలుగురు కొడుకులు పెళ్లయి పిల్లలు ఉన్నవారు ఎన్నో కుటుంబాలు ఉన్నాయి. ఇండ్లులేనివారికి అధికారులు గుర్తించి ఇందిరమ్మ ఇళ్ళను మంజూరు చేయాలిని అధికారులను కోరారు.

# ప్రతిభ కనబరిచిన విద్యార్థికి అభినందన



**అచ్చంపేట,మే06 (జనం సాక్షి):** మండల పరిధిలోని గణపురం గ్రామానికి చెందిన భవ్య ఇంటర్మీడియట్ లో రాష్ట్ర స్థాయిలో ప్రతిభ కనబరిచి మూడవ ర్యాంక్ సాధించిన విద్యార్థిని కొమ్మెర భవ్యను స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ మంగళవారం అభినందనలు తెలిపారు. తల్లిదండ్రులతో మాట్లాడి విద్యాతో విద్యార్థిని రాణించేందుకు ప్రోత్సహించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. ఉన్నత స్థానాన్ని అధిరోహించాలని నల్లమల పేరును రాష్ట్ర వ్యాప్తంగా వినిపించిందన్నారు. తన వంతు సహాయ సహాకారాలను అందిస్తానని హామి ఇచ్చారు. శాలువాతో విద్యారిని భవ్యను సన్మానించారు. మండల పరిధిలోని ఘణపూర్ గ్రామానికి చెందిన కొమ్మెర ఈశ్వరమ్మ. వెంకటయ్య ల కూతురు కొమ్మెర భవ్య ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం ఫలితాల్లో (ఎంపీసీ) 470మార్కులకు గాను 466 మార్కులు సాధించి రాష్ట్ర స్థాయిలో మూడవ ర్యాంక్ సాధించింది.



# మృతుని కుటుంబానికి ఆర్థిక సహాయం

**కల్వకుర్తి మే 6(జనంసాక్షి)**

కల్వకుర్తి మండలం పంజుగుల గ్రామానికి చెందిన హనుమకొండ పెద్ద పరశుయ మృతి చెందాడు. స్థానిక బీఆర్ఎస్ నాయకుల ద్వారా ఈ విషయం తెలుసుకున్న కల్వకుర్తి మాజీ శాసనసభ్యులు జైపాల్ యాదవ్ బీఆర్ఎస్ పార్టీ నాయకుల ద్వారా ముందుగా మృతునీ కుటుంబ సభ్యులను పరామర్శించి కుటుంబ సభ్యులకు 5000రూపాయలు ఆర్థిక సాయం అందించారు. ఈ కార్యక్రమంలో రామకృష్ణ మాజీ సర్పంచ్ పద్మ అంజి, ఎండి ఖజా, బాలగౌడ్, మల్లేష్ సురేందర్, రాము, లక్ష్మణ్, ఎలిసా,ఆంధ్రయ, సాయిలు శ్రీనివాసులు, కృష్ణ, విష్ణు పాల్గొన్నారు.

# పక్కా ప్రణాళికతో చదివితే విజయం సాధ్యం

## టౌన్ ఎస్ఐ వెంకటేశ్వర్లు



**నారాయణపేట జిల్లా బ్యూరో(జనం సాక్షి) :** పక్కా ప్రణాళిక తో చదివితే పోటీ పరీక్షల్లో విజయం ఖాయమని నారాయణపేట టౌన్ ఎస్సై వెంకటేశ్వర్లు అన్నారు. నారాయణపేట జిల్లా కేంద్రంలోని కోచింగ్ సెంటర్ లో మంగళవారం విద్యార్థులకు చదువుపై శ్రద్ధ, పోటీ పరీక్షలకు సన్నద్ధ, సైబర్ నేరాలు, చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని, సెల్ఫోన్ వినియోగానికి దూరంగా ఉండాలని తదితర అంశాలపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సంద ర్భంగా వెంకటేశ్వర్లు మాట్లాడుతూవిద్యార్థులు చిన్నతనం నుండి చదువుపై పట్టు సాధించాలని, ఏకాగ్రతతో ప్రణాళికబద్ధంగా చదివి ఉన్నత ఉద్యోగాలు సాధించాలని తెలిపారు. యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలన్నారు. నేటి ఆధునిక పోటీ ప్రపంచంలో ప్రభుత్వ ఉద్యోగం పొందడం సులువు కాదని, గట్టిగా ప్రయత్నిస్తే, అసాధ్యం ఏమీ ఉండదని ఎస్సై అన్నారు. నిరంతర శ్రమ, అహర్నిశలు కృషిచేసినప్పుడు కోరుకున్న స్థాయికి చేరుకోగలమని పేర్కొన్నారు. అలాగే నిరుద్యోగ అభ్యర్థులు తల్లిదండ్రుల కలలను సాకారం చేయడంతో పాటు, తమ పుట్టిన ఊరికి మంచి పేరు తీసుకురావాలని, లక్ష్యాలను నిర్దేశించుకుని చదివి విజయం సాధించాలని తెలిపారు. అలాగే సైబర్ నేరాల పట్ల జాగ్రత్తలు పాటించాలని సైబర్ నేరాలకు గురైతే 1930 టోల్ ఫ్రీ నెంబర్ కు సమాచారం ఇవ్వాలని సూచించారు. ఎవరైనా అత్యవసర సమయంలో డయల్ 100 కు కాల్ చేసి పోలీసులకు సమాచారం ఇవ్వాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో బి కే ఎస్ కోచింగ్ డైరెక్టర్ నవిత బి కే ఎస్ వెంకట్ రాములు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

# 20న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయండి

### సిఐటియు జిల్లా అధ్యక్షులు బీరం మల్లేశం



**సదాశివపేట మే 6(జనం సాక్షి) :** కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ కార్మికులకు అనుకూలంగా ఉన్న 29 కార్మిక చట్టాలను నాలుగు లేబర్ కోడ్ లుగా మార్చి పెట్టుబడుదారులకు అనుకూలంగా తయారు చేయడాని నిరసిస్తూ ఈనెల 20వ తేదీన జరిగే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో కార్మికులందరూ పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు బి మల్లేష్ పిలుపునిచ్చారు. మంగళ వారం స్థానిక సదాశివపేట ఆఫీస్‌లో సమ్మె సంబంధించిన కరపత్రాన్ని విడుదల చేయడం జరిగింది. బి మల్లేష్ మాట్లాడుతూ కేంద్ర బిజెపి ప్రభుత్వం మూడోసారి అధికారంలోకి వచ్చాక కార్మికుల అనుకూలంగా ఉన్న చట్టాలను మొత్తం మార్చేస్తుందనీ, కార్మికులను కట్టు బానిసల్లాగా తయారు చేస్తుందన్నారు. స్వాతంత్రం రాకముందు పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను మొత్తం పెట్టుబడిదారులకు అనుకూలంగా తయారు చేసి కార్మికుల యొక్క పని గంటల సమయాన్ని పెంచడానికి ప్రయత్నం చేస్తుందాని, ఎనిమిది గంటల పని విధానం స్థానంలో మళ్లీ 12 గంటల పని విధానం తీసుకురావాలని ప్రయత్నం చేస్తుందన్నారు. అదేవిధంగా పరిశ్రమల్లో పని చేస్తే కార్మికులను పర్మినెంట్ చేయకుండా కాంట్రాక్టు క్యాజువల్ మ్యాప్స్, ఎఫ్ టి సి పేరుతో పని చేయించుకొని శ్రమ దోపిడీకి గురిచేస్తున్నారని అన్నారు. పెట్టుబడిదారుల కార్పోరేట్ సంస్థల లాభాలు పెంచడానికి కార్మికుల కు అనుకూలంగా ఉన్న చట్టాలను మార్చివేస్తుందని, దేశంలో ఉన్న అన్ని కార్మిక సంఘాలు కలిపి ఈనెల 20వ తేదీన దేశవ్యాప్త సార్వత్రిక సమ్మె చేయాలని నిర్ణయం చేయడం జరిగింది అన్నారు.పట్టణ ప్రాంతంలో ఉన్న కార్మికులందరూ సమ్మెలో పాల్గొనే జయప్రదం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు వి ప్రవీణ్ కుమార్ సిఐటియు నాయకులు ఎన్ మల్లేశం శ్రీనివాస్ సత్యనారాయణ, మోహన్ చారి, రవి పాండురంగం శ్రీనివాస్ గౌడ్ ప్రసాద్ రవికుమార్, జావిద్ తదితరులు పాల్గొన్నారు.

# ఆరు రోజులుగా అదృశ్యమైన వ్యక్తి



**న్యాల్ కల్, మే 06, (జనం సాక్షి) :** ఆరు రోజులుగా ఆచూకీ లభించక పోవడంతో ఓ వ్యక్తి అదృశ్యమైన సంఘటన మండలంలోని హుమ్నాపూర్ గ్రామంలో చోటు చేసుకుంది. కుటుంబీకులు, అదృశ్యమైన వ్యక్తి భార్య లక్ష్మి తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని హుమ్నాపూర్ గ్రామానికి చెందిన కొండ బసవరాజు (35) ఎప్రిల్ 30న ఉదయం ఇంట్లో నుంచి అదృశ్యమయ్యాడు. రాత్రైన స్వగృహానికి తిరిగి రాకపోవడం, చరవాణి (సెల్ఫోన్) స్విచ్ ఆఫ్ కావడంతో ఆందోళనకు గురైన కుటుంబీకులు.. గత రెండు, మూడు రోజులుగా బంధువులు, స్నేహితులు, దేవాలయాలు, ఇతరత్రా ప్రాంతాల్లో పరిశీలించారు. అదృశ్యమై ఆరు రోజులు గడుస్తున్న ఆచూకీ లభించకపోవడంతో ఆందోళనకు గురైన కుటుంబీకులు, భార్య లక్ష్మి మంగళవారం స్థానిక హదునూర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. బసవరాజ్ ఆచూకీని గుర్తిస్తే 6301967125, 9900216278 లకు సమాచారం ఇవ్వాలని కోరారు.

# ఉచిత వేసవి శిక్షణ తరగతులు సద్వినియోగం చేసుకోండి



**ఉర్కొండ, మే 6,( జనం సాక్షి):** నాగర్ కర్నూల్ జిల్లాలో జిల్లా విద్యాశాఖ అధికారి ఆదేశానుసారం 29 ప్రభుత్వ పాఠశాలలో వేసవి శిబిరాలను ప్రారంభించారు. ఈ కార్యక్రమాన్ని పురస్కరించుకొని ఉరుకొండ మండలంలోని ఉర్కొండ పేట జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో శిక్షణ శిబిరాన్ని ప్రధాన ఉపాధ్యాయురాలు హబీబున్నిసా ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. సందర్భంగా మాట్లాడుతూ ఈ వేసవి శిబిరంలో కమ్యూనికేషన్ స్కిల్స్, డాన్స్, ఇండోర్ గేమ్స్, బేసిక్ మ్యాథ్స్ స్కిల్స్, స్పోకెన్ ఇంగ్లీష్,ఆర్ట్, క్రాఫ్ట్ తదితర అంశాల్లో నిపుణులు మెళుకువలు నేర్పిస్తారనీ,విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సమ్మర్ క్యాంపు నిర్వహించడానికి ఒక పాఠశాలకి వంద మంది విద్యార్థులకు యూనిట్ కాస్ట్ 50 వేల చొప్పున కేటాయించబడిందని దానిలో భాగంగా నలుగురు విద్యా వాలంటీర్లని (ఆర్ట్ లేదా క్రాఫ్ట్ లేదా డాన్స్ లేదా స్పోకెన్ ఇంగ్లీష్ లేదా బేసిక్ మ్యాథ్స్ స్కిల్స్ లేక యోగా) అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ ద్వారా నియామకం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమానికి పాఠశాల ప్రధానోపాధ్యాయులు, నలుగురు వాలంటీర్లని తీసుకొని, 15 రోజులపాటు ఈ క్యాంపు నిర్వహించాలని జిల్లా విద్యాశాఖ అధికారి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు హబీబున్నీసా, వ్యాయామ ఉపాధ్యాయులు జగన్, ఉపాధ్యాయులు,విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# వరి కొయ్యలను కాల్చడం వల్ల రైతులకే ఎక్కువ నష్టం

### మండల వ్యవసాయ అధికారి మెంగని యాదగిరి



**నార్సింగి మే 06 (జనంసాక్షి) :** పంట వ్యర్థాలు దహనం చేయడం వల్ల భూ సారానికి, రైతులకు నష్టం కలుగుతుందని మండల వ్యవసాయ అధికారి మెంగని యాదగిరి అన్నారు. నార్సింగి మండల కేంద్రంలోని వ్యవసాయ శాఖ కార్యాలయం లో యాదగిరి మాట్లాడుతూ మండల పరిధిలో దాదాపు 90 నుంచి 95 శాతం కోతలు పూర్తి అయ్యాయని తెలిపారు. కోతల అనంతరం పొలాల్లో మిగిలి పోయే వరి కొయ్య లను కాల్చడం కంటే కలియ దున్నడం వల్ల రైతులకు అనేక లాభాలు ఉన్నాయని అన్నారు. పంట వ్యర్థాలను కాల్చడం వల్ల భూమిలోని పంటలకు మేలు చేసే సూక్ష్మ జీవులు , వాన పాములు చని పోతాయని, పై పొరలో ఉండే సేంద్రియ కర్బన పదార్థాలు దెబ్బతింటాయని అందువల్ల పంట దిగుబడి తగ్గే అవకాశం ఉందని వివరించారు. కాల్చడానికి బదులు వరి కొయ్యలను నీటిలో కలియ దున్నడం వల్ల పంటలో నీటి నిలువ సామర్థ్యం పెరిగి, సేంద్రియ కర్బన పదార్థాలు పెరుగుతాయని, నత్రజని, భాస్వరం, పొటాష్ వంటి స్థూల, సూక్ష్మ పోషకాలు పంటకు అంది దిగుబడి పెరుగుతుందని అన్నారు. పంట వ్యర్థాలు త్వరగా కుళ్లడానికి రైతులు 40 - 50 కేజీల సింగిల్ సూపర్ ఫాస్ఫేట్, 15 కేజీల యూరియా లేదంటే మార్కెట్ లో లభ్యమయ్యే వేస్ట్ డికంపోజ్ ద్రావణాన్ని చల్లుకుని, రోటివేటర్ తో గాని లేదా కల్టివేటర్ తో కలియ దున్నితే సూక్ష్మ జీవులు, వాన పాముల సంతతి పెరిగి పంట దిగుబడికి దోహద పడతాయని తెలిపారు. పంట వ్యర్థాలను కాల్చి వేసి నట్లయితే పంటకు నష్టం తో పాటు వాయు కాలుష్యం పెరిగి రైతుల, ఇతరుల ఆరోగ్యం, పర్యావరణం దెబ్బ తింటుందని, కావున రైతులు వ్యర్థాలను కాల్చ వద్దని కోరారు.

# గాలికుంటు టీకాలు సద్వినియోగం చేసుకోండి



**మల్దకల్ మే 6(జనంసాక్షి)** మండలంలో పశువులలో గాలికుంటు వ్యాధి నివారణ టీకాల వేశారు.మంగళవారం మల్లెందొడ్డి,నాగర్ దొడ్డి గ్రామాలలో ఉచిత గాలికూంటూ వ్యాధినివారణ టీకాల వేశారు.జిల్లా పశువైద్యధికారి డా!పి. వెంకటేశ్వర్లు,పశుసంవర్ధక శాఖ సహాయ సంచాలకులు డా! యుఆర్ రమేష్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. జిల్లా పశువైద్యధికారి వెంకటేశ్వర్లు రైతులతో మాట్లాడుతూ గాలికుంటూ వ్యాధి వచ్చిన పశువుల నోటిలో,గిట్టల మధ్యలో పుండ్లు కావటం చోంగ కారటం, పశువు మేత తినకపోవటం, జ్వరం ఉండటం వంటి లక్షణాలు కనిపిస్తాయి,ఈ వ్యాధి సోకిన పశువును మంద నుంచి వేరుచేసి చికిత్స అందంచాలి,ప్రతి రోజు నోటిని,గిట్టలని పోటాష్యామ్ పర్మాంగానేట్ లోషన్ తో కడగాలి,వ్యాధి సోకిన పశువుకు జొన్న సంకటి, జావా,వంటివి త్రాగిచాలి,పాడి పశువులలో ఈ వ్యాధి వలన పాలు తగ్గిపోవటం,చూడి పశు వులు ఈసుకపోవటం, అపుడప్పుడు మరణాలు కూడా సంభవించడం జరుగుతుంది.గాలి కుంటూ వ్యాధి రాకుండా ముందుగానే టీకాలు వేయించుకోవాలని, టీకాలు వేసిన ప్రతి పశువుకు గుర్తింపు చెవి పోగు వేసి పశు పోషకుల వివరాలు ఐఎన్ ఏ పి హెచ్ పోర్టల్ లో నమోదు చేయించామని,రైతులకు వివరించటం జరిగింది.ఈ కార్యక్రమంలో 210తెల్లపశువులు,56 గేదెలకు గాలికుంటూ వ్యాధి నివారణ టీకాలు వేయటం జరిగింది.ఈ కార్యక్రమంలో మండల పశువైద్యధికారులు డా!పి.వినయ్ కుమార్, డా!ఉష,పశువైద్య సిబ్బంది పశుసహాయకులు రాజేంద్ర , యుగేందర్ రెడ్డి,గోవర్ధన్ ,అర్జున్ సింగ్,సిబ్బంది రామాంజనేయులు , శాంతిరాజ్ ,రామేశ్వరయ్య, మధు పాల్గొన్నారు.

# రాజీవ్ యువ వికాసం పథకానికి లబ్ధిదారుల ఎంపిక



### ఉర్కొండ ఎంపీడీవో కృష్ణయ్య

**ఉర్కొండ మే 6, ( జనం సాక్షి) :** రాజీవ్ యువ వికాసం పథకం 2024-25 సంవత్సరానికి గాను అర్హులైన లబ్ధిదారులను ఎంపిక చేయుటకు ఆయా బ్యాంకు పరిధిలోని గ్రామాల లబ్ధిదారులు పాల్గొనాలని ఉరుకొండ ఎంపీడీవో కృష్ణయ్య తెలియజేశారు. మే నెల తేది 8 గురువారం రోజు 10.30 గంటల నుండి మాధారం గ్రామ పంచాయతీ కార్యాలయం నందు యుకో బ్యాంక్ మాధారం పరిధిలోకి వచ్చు గ్రామాలు 1. మాధారం2. గుడిగానిపల్లి,3. రేవల్లి,4. తిమ్మన్నపల్లి 5. రాచాలపల్లి గ్రామాల లబ్ధిదారులు, మే నెల తేది 9 ,ఉ. 10.30 గంటల నుండి ఎంపీడీఓ కార్యాలయం ఊర్కొండ యందు టి జి వి బి ఊర్కొండపేట , ఎస్బిఐ వెల్జాల్ బ్యాంకుల పరిధిలోకి వచ్చు గ్రామాలు 1. ఊర్కొండ,2. ఊర్కొండపేట 3. గుండ్లగుంటపల్లి,4. నర్సంపల్లి,5. జకినాలపల్లి 6. ఇప్పపహాడ్ ,7. ముచర్లపల్లి,8. రాంరెడ్డిపల్లి 9. జగబోయినపల్లి,10. బాల్యలోక్య తాండా 11. బొమ్మరాసిపల్లి గ్రామాలకు చెందిన దరఖాస్తు చేసుకున్న ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీ కార్పొరేషన్స్ ద్వారా సంబంధిత బ్యాంకు మేనేజర్లచే ఇంటర్వ్యూలు నిర్వహించబడుననీ. దరఖాస్తు చేసుకున్న అందరు హాజరు కావాలని కోరుకొండ ఎంపీడీవో కృష్ణయ్య తెలియజేశారు.

# ముగిసిన శ్రీశేషాదాసుల ఆరాధన ఉత్సవాలు



**మల్దకల్ మే 6(జనంసాక్షి)** ప్రముఖ కర్ణాటక వాగ్గేయకారుడు శ్రీ శేషదాసుల 140వ ఆరాధన ఉత్సవాలు ఆదిశీలా క్షేత్రం మల్దకల్ లో మూడు రోజులపాటు ఘనంగా నిర్వహించారు.శ్రీ శేషదాసుల వంశస్తులైన శేషగిరిరావు, దీరేంద్ర దాస్,రాఘవేంద్ర దాస్, విష్ణు,శశాంక ఆధ్వర్యంలో ఆరాధన ఉత్సవాలు ఘనంగా ముగిశాయి.మంగళవారం శ్రీ సత్యనారాయణ పూజ, అభిషేకాలు నిర్వహించారు. అనంతరంసంగీత కాకండికి ఆదోని,వసంతాచారి అధ్యాపకులు, జయరామాచార్య ఆధ్వర్యంలో పురాణ ప్రవచనాలు వినిపించారు.శేషదాసుల వారి మహిమ గురించి భక్తులకు వివరించడం జరిగింది.ఈ సందర్భంగా దీరేంద్రదాస్ మాట్లాడుతూ ఉత్సవాలు విజయవంతంగా ముగియడానికి భక్తుల సహకారం,దేవాలయ నిర్వహకుల సహకారం ఎంతో ఉందని తెలిపారు.ఈ కార్యక్రమంలో దేవాలయ చైర్మన్ పట్వారి ప్రహ్లాద రావు, పట్వారీ అరవిందరావు, చంద్రశేఖర రావు, బాబురావు, మధుసూదనాచారి, రమేష్, రవి, ప్రాణేష్,వెంకోబారావు, మనోహర్ రావు,ప్రకాష్ రావు, గోపాల్ రావు,అశోక్ తదితరులు పాల్గొన్నారు.

